85
ధారావాహిక



# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి ...
99893 71284

**జరిగిన కథ :** జాయపుని నెత్తిన కొత్త బాధ్యతలు పెట్టాడు చక్రవర్తి. అనుమకొండలో వీడ్కోలు తీసుకుంటూ.. అంతఃపురం వెళ్లాడు జాయపుడు. నారాంబ కన్నీరుమున్నీరయ్యింది. తమ్ముణ్ని ఆర్తిగా అల్లుకుంది. అక్క, మేనల్లుళ్లపై కుట్రలు జరుగుతున్న సమయంలో వాళ్లకు దూరం కావాల్సి రావడం.. జాయపుణ్ని విచికిత్సకు లోనుచేసింది. ఆ భయాన్ని తొలగిస్తూ అభయమిచ్చాడు గణపతిదేవుడు. అప్పడే.. పెళ్లి ప్రస్తావన కూడా తెచ్చారు. తానొక గ్రామీణ యువతిని ఇష్టపడ్డాననీ, అందువల్ల మరో స్త్రీని భార్యగా స్వీకరించలేనని చెప్పాడు జాయపుడు. ఇద్దరూ నిరుత్తరులయ్యారు.

జాయపుని వ్యక్తిగత సామగ్రి అంతా అప్పటికే వెలనాడువైపు పంపించారు. విక్రమ వద్ద నిలబడిన అంకమరట్టను మరోసారి అడిగాడు జాయపుడు..

''వైద్యుడి మరణం వెనక అసలువ్యక్తి ఎవరో.. తెలిసిందా అంకమా?''.

''ఇక ఆ సంగతి వదిలెయ్యండి నాట్యాచార్యా! మహామండలేశ్వరులు ప్రసాదిత్య సేనానిని స్వయంగా విచారించి తీవ్రంగా హెచ్చరించారని.. ఈ విషయంలో కుతూహలం చూపవద్దని.. నన్ను మా గూఢచార నియోగాధిపతి కూర్మయ హెచ్చరించారు''.

''ఓ.. విషయం అంతవరకూ వెళ్లిందన్నమాట. ఇక మనం దీనిని పక్కన పెట్టవచ్చా అంకమా?''.

''ప్రస్తుతానికి పక్కన పెడదాం నాట్యాచార్య!''.

ప్రశాంతంగా ధనదప్రోలు వచ్చేశాడు జాయప.

* * *

తలగడదీవి గ్రామ పొలిమేరల్లోని కృష్ణాతీరం..

పినచోడుని సమాధి.. దాని చుట్టూ నిర్మించిన ఉద్యానవనం. జాయపుడు నిత్యమూ అక్కడికి వెళతాడు. తండ్రి సమాధిని చూస్తూ కూర్చుంటాడు. కాసేపటికి తండ్రి కర్మల రోజు కనిపించిన ఆమె.. ఆమెకోసం వెతుకుతాడు. కృష్ణమ్మ ఒడ్డున అదొక శిథిలమందిరాల ప్రాంతం. గొడ్లను మేపుకొనే కుర్రాళ్లను, అక్కడ తిరుగాడే పెద్దలను అడుగుతాడు. ప్చ.. ప్రయోజనం శూన్యం. తండ్రి సమాధి వద్ద జారగిలపడతాడు. వెలనాడు వచ్చిన నాటి నుంచి నిత్యమూ అదే కార్యక్రమం.

వెలనాడుకు పాలకుడిగా సోదరుడు జాయపుడు వస్తున్నాడంటే.. అయ్య కుటుంబమంతా ఆనంద డోలికల్లో ఉయ్యాలలూగింది. ఓ కొత్త పండుగ వాతావరణం.. కొత్త చైతన్యం ఏదో తలగడదీవి అంతటా పొంగిపొర్లింది.

బావగారు నిర్దేశించకపోతే తమ్ముడు ఇక్కడికి వచ్చేవాడు కాదు. అక్కను, మేనల్లుళ్లను విడిచి అనుమకొండ వదిలి మరోచోటుకు.. అదీ జన్మభూమైనా జాయపుడు వస్తాడని అన్నదమ్ములు అనుకోలేదు.

వచ్చినందుకు వాళ్లంతా ఎంతో సంతుష్టి చెంది, జాయపుణ్ని అపురూపంగా చూడసాగారు.

అయితే జాయపుడు వాళ్లు ఊహించినంత ఉత్సాహంగా లేడు. చక్రవర్తి బావగారు, అక్క పొగుడుకున్నంత ఉత్తేజంగానూ లేడు. మహాయుద్ధ వీరత్వం కనిపించడం లేదు. ఏనుగులతో యుద్ధతంత్రాలు పన్నిన విశేష లక్షణం గోచరించడం లేదు. సాక్షాత్తూ శివుడే దిగివచ్చి నాట్యమాడుతున్నాడనే చురుకు ఎటుపోయిందో!? అక్కల పెళ్లి నాడున్న ఉత్సాహం, దూకుడు కూడా ఇప్పుడు కనిపించలేదు.

దినదినమూ ప్రవర్తన అలా స్తబ్ధుగా ఉంటున్నది.

కానీ ఓ రోజు.. పినచోడుని సమాధి వద్ద కూర్చుని ఉన్నాడు జాయపుడు.

దగ్గరగా కృష్ణ నీటిపాయపై సర్రున జారిపోతున్న నాటుపడవలు.. తోపుడు తెడ్లు వేస్తూ.. లాగుతూ జాలరుల మాటలో.. పాటలో.. స్పష్టాస్పష్ట పలుకుబడి సౌందర్యం, యాస మాధుర్యం వింటున్నాడు. వాటారుతున్న ఎండ.. గాలితో కలిసి కృష్ణా తరంగాలతో చెప్పే కబుర్ల చల్లదనపు గిలిగింతలు.. నదీ అలల లోనుంచి పైకి ఎగురుతున్న చేపలు.. ఎగిరినప్పుడల్లా పడమట వాలుతున్న సూర్యకిరణాలకు మిలమిలా మెరిసి.. మళ్లా గొప్ప ఈతగాడిలా నీటిలోకి సర్రున దూకుతున్నాయి. వాటి ఆటలను విభ్రమంగా చూస్తూ.. నీలి ఆకాశాన పల్లటీలు కొడుతున్న పిట్టలు, పక్షులు.

ఆ సాయంవేళ ఆహ్లాదపరుస్తున్న కృష్ణా తరంగాలలా ఆలోచనా తరంగాలు లోపలా బయటా చుట్టుకుని, మనసును ఒరుసుకుని ప్రవహిస్తున్నాయి.

నారాంబ తమ్మునిగా రాజనగరికి చేరాక జరిగిన సంఘటనలు.. సంఘర్షణలు.. యవ్వన ఉదంతాలు.

కాకతి, ఇంద్రాణి, లలితాంబ..